రైతుల ఆశలన్నీ మొక్కజొన్నపైనే..

- మిర్చి నష్టాన్ని మొక్కజొన్నతో పూడ్చుకోవాలని భావిస్తున్న రైతులు
- తొలుత కత్తెర పురుగు బెంబేలెత్తించినా సస్యరక్షణతో కొలిక్కి..
- ఎకరాలకు 2 నుంచి 3 టన్నుల దిగుబడి రావచ్చని అంచనా
- ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర రూ.35 వేల నుంచి రూ.38 వేలు
- ధర తగ్గితే అప్పులపాలవుతామని రైతుల ఆందోళన


మార్కాపురం సమీపంలో కోత దశలో ఉన్న మొక్కజొన్న పంట

మార్కాపురం: ఆరుగాలం కష్టపడి మిర్చి పండించిన రైతులకు ఈ ఏడాది నష్టాలే మిగిలాయి. గత ఏడాది క్వింటా రూ.24 వేలకు పైగా పలికిన మిర్చి ధర ప్రస్తుతం రూ.11 వేలకు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మిర్చి సాగుతో చవిచూసిన నష్టాన్ని మొక్కజొన్నతో పూడ్చుకునేందుకు కొందరు రైతులు సిద్ధం కాగా.. మరికొందరు లాభం వస్తుందని ఆశిస్తున్నారు. మొక్కజొన్న ధర నిలకడగా ఉంటేనే తమ ఆశలు ఫలిస్తాయని చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది లక్ష్యానికి మించి మొక్కజొన్న సాగు చేశారు. 2024–25లో 4960 హెక్టార్లలో పంట సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేయగా 5704.50 హెక్టార్లలో రైతులు సాగు చేశారు.

పశ్చిమ ప్రకాశంలో అధిక సంఖ్యలో రైతులు మొక్కజొన్న దిగుబడి, ధరపైనే ఆశలు పెట్టుకున్నారు. మార్కాపురం, తర్లుపాడు, గిద్దలూరు, బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు, కొమరోలు,రాచర్ల,యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, దోర్నాల మండలాల్లో సుమారు 2,300 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేసినట్లు అంచనా. మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం, చింతగుంట్ల, వేములకోట, ఎల్‌బీఎస్ నగర్, మిట్టమీదిపల్లి, కోలభీమునిపాడు, మాల్యవంతునిపాడు, తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు తదితర గ్రామాల్లో ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభంలో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. 15 నుంచి 20 రోజుల్లో కోత దశకు వచ్చే అవకాశం ఉంది. ఎకరాకు పెట్టుబడి సుమారు 20 వేల రూపాయలకు పైగా రైతులు పెట్టుబడి పెట్టారు. దిగుబడి పరంగా చూస్తే సుమారు రెండున్నర నుంచి 3 టన్నుల వరకు రావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం టన్ను రూ.35 వేల నుంచి 38 వేల రూపాయల ధర పలుకుతోంది. మొదట్లో కత్తెర పురుగు ఆశించినప్పటికీ రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడంతో పురుగు అదుపులోకి వచ్చింది.

ప్రస్తుతం బోర్ల కింద సాగవుతున్న పంటకు నీటి ఇబ్బంది ఏర్పడుతోంది. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లలో నీరు రావడం లేదు. దీంతోపాటు విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. మరో వైపు అడవి పందుల బెడద ఎక్కువగా ఉండటంతో రైతులు రాత్రిపూట పొలాల్లోనే జాగారం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధర నిలకడగా ఉంటే ఇబ్బంది లేదు కానీ, ధర తగ్గితే కష్టమని రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. మిర్చి, పత్తి పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులు ప్రస్తుతం మొక్కజొన్న దిగుబడి, ధరపైనే ఆశలు పెంచుకున్నారు. కొంతమంది రైతులు వివిధ కంపెనీలతో ఒప్పందం చేసుకుని మొక్కజొన్న సాగు చేపట్టారు. దీంతో వారంతా మంచి ధర ఉంటుందని ఆశిస్తున్నారు.

> **మంచి ధర ఇస్తారనుకుంటున్నా**
>
> 
>
> మూడెకరాల్లో మొక్కజొన్న సాగుచేశా. రాత్రి పూట అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. నాతో పాటు మిగిలిన రైతులు రోజూ పొలాల్లోనే పడుకుంటున్నారు. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినప్పటికీ ఒక వైపు అడవిపందులు, మరో వైపు పిట్టలు, పిచ్చుకలు పంట మీద వాలుతున్నాయి. ప్రస్తుతం ధర రూ.34 వేల నుంచి రూ.38 వేల వరకు పలుకుతోంది. మరో రూ.2 వేలు పెరిగితే ఇబ్బంది లేకుండా ఉంటుంది.
>
> – లక్ష్మిరెడ్డి, రైతు వేములకోట

క్లుప్తంగా

14న ఏపీటీఎఫ్ ప్రాంతీయ విద్యా సదస్సు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నరవ రోడ్డులో గల సీతారామ కల్యాణ మండపంలో ఈ నెల 14న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గిద్దలూరు జోన్ ప్రాంతీయ విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు టి.సుబ్బారాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీపీ కడప లక్ష్మి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


అనుములపల్లెలో విచారిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

రాచర్ల: మండలంలోని అనుములపల్లె గ్రామానికి చెందిన రైతు సిరిగిరి రంగనాయకులు 2022 సెప్టెంబర్ 22వ తేదీ ఆత్మహత్య చేసుకున్నారు. మండల వ్యవసాయాధికారులు రైతు ఆత్మాహత్యగా ప్రభుత్వానికి నివేదిక పంపించడంతో మంగళవారం మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అనుములపల్లెలోని రైతు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, సర్పంచ్ రమేష్, రైతు సేవా కేంద్రం వీఏఏ రమణ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డుతో అవస్థలు


గరిమినపెంట సమీపంలో కోతకు గురైన మట్టి రోడ్డు

కొనకనమిట్ల: మండలంలోని గరిమినపెంట నుంచి వెలుగొండ్రాయునిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి గతంలో కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో గరిమినపెంట నుంచి వెలుగొండ్రాయునిపల్లి ఎస్సీ కాలనీ, గొట్లగట్టు వరకు వెళ్లే వారికి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ట్రాక్టర్, ఆటోలు ఆ రోడ్డున రావాలంటే తంటాలు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వర్షం పడినప్పుడు తరుచుగా మట్టిరోడ్డు కోతకు గురవుతుందని, అధికారులు స్పందించి కోతకు గురైన చోట శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే గరిమినపెంట సమీపంలోని వాగు వద్ద చప్టా నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సోలార్ ప్లాంటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

కొమరోలు: మండలంలోని అల్లినగరం సబ్ స్టేషన్ సమీపంలో సోలార్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తహసీల్దార్ భాగ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు సోలార్ ఎనర్జీ ప్లాంటు నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామన్నారు. తనిఖీ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు చెప్పారు. సోలార్ ఎనర్జీ ప్లాంట్‌కు 10 ఎకరాల స్థలం అవసరమని పేర్కొన్నారు. ఆమె వెంట మండల సర్వేయర్ సిలార్‌ఖాన్, వీఆర్‌ఓ రమణ, గ్రామ సర్వేయర్ ప్రవీణ్ ఉన్నారు.

ప్రజల మనసులో వైఎస్ జగన్ స్థానం సుస్థిరం

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె
- పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు


అన్నా రాంబాబు


జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: ప్రజల మనసులో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానం సుస్థిరమని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. దివంగత మహానేత వైఎస్సార్ పాలన, వైఎస్ జగన్ పాలన ప్రజలకు స్వర్ణయుగమని, నవరత్నాలు పథకాలను అమలు చేసి ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మార్చిన ఘనత వారికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీతో ఉచిత కార్పొరేట్ వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంటుతో ఉచితంగా కార్పొరేట్ చదువులు, గ్రామ సచివాలయాలతో గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేశారని కొనియాడారు. ప్రజల మనసులో నుంచి వైఎస్ జగన్‌ను ఎవరూ తొలగించలేరన్నారు. వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఉదయం 7.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఒంగోలులో కలెక్టరేట్ వద్ద నిర్వహించే యువతపోరు కార్యక్రమానికి బయలుదేరనున్నట్లు తెలిపారు.

పేద విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వం చెలగాటం


యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తర్లుపాడు: పేద విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందని మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రం తర్లుపాడులో యువతపోరు పోస్టర్‌ను ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిది నెలలుగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించకుండా వేధించడాన్ని తప్పుబట్టారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామంటూ మోసం చేశారని దుయ్యబట్టారు. బుధవారం ఒంగోలులో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమంలో యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు పెద్దమస్తాన్ జన్మదిన వేడుకలు తర్లుపాడులోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నేడు తర్లుపాడులో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు తెలిపారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు రామిరెడ్డి, కాశయ్య, పెద్దమస్తాన్, రమణయ్య, జాన్ రత్నం, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, పార్టీ నాయకులు డి.భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ పఠాన్, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు సరిచూసుకోండి


మొక్కజొన్న రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మెర్సీ, ఉద్యానశాఖ అధికారి శ్వేత

బేస్తవారిపేట: రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన పంట నమోదు జాబితాను రైతులు పరిశీలించుకోవాలని ఏఓ జక్కం మెర్సీ సూచించారు. మంగళవారం ఆమె చెరుకుపల్లె, గంటాపురంలో గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ పంట నమోదులో ఏవైనా తప్పులుంటే వీఏఏలను సంప్రదించాలని సూచించారు. కంది, శనగ పంటలు వేసిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. కందులను రూ.7550, శనగలను రూ.5650 మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. మొక్కజొన్న పంటలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారిణి డి.శ్వేత, వీఏఏ వై.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తర్లుపాడు: రబీలో సాగు చేసి ఈ పంటలో నమోదు చేసిన పంటల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శించినట్లు ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. జాబితాను రైతులు పరిశీలించుకుని తప్పులు ఉంటే వీఏఏలను సంప్రదించాలని సూచించారు. మంగళవారం నాగెళ్లముడుపు, ఉమ్మారెడ్డిపల్లిలో రైతులతో ఏఓ సమావేశం నిర్వహించి పంటల సాగుపై సలహాలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది దేవేంద్ర, వెంకట సుబ్బమ్మ, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు కార్డు ఉన్న రైతులకే పథకాలు

పొదిలి రూరల్: విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏవో ఎస్‌కే జైనులాబ్దిన్ పేర్కొన్నారు. మంగళవారం పొదిలి మండలంలోని ఏలూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రైతు విశిష్ట గుర్తింపు కార్డు కోసం రైతు సేవా కేంద్రంలో వీఏఏను సంప్రదించాలని సూచించారు. రబీలో పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. రైతులందరూ జాబితాను పరిశీలించి, తప్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం

మార్కాపురం: రైతులు మే నెలలో పొలాల్లో లోతు దుక్కులు చేసుకోవాలని, భూమి సారవంతం కావాలంటే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పైర్లు వేసుకోవాలని ఏఓ డి.శ్రీనివాసులు రైతులకు సూచించారు. మంగళవారం భూపతిపల్లి, బొందలపాడు గ్రామాల్లో మిరప పంటను పరిశీలించి, రైతులకు సస్యరక్షణ గురించి వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. రసాయనిక ఎరువుల మోతాదు మించితే పెట్టుబడి వ్యయం పెరుగుతుందని, భూమి సారం కోల్పోతుందన్నారు. రైతులు ఈ వేసవిలో భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది రమణి, రైతులు పాల్గొన్నారు.

పప్పుధాన్యాల నిల్వలో జాగ్రత్తలు అవసరం

కొమరోలు: పప్పుధాన్యాలు నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించాలని ఏఓ రాజశ్రీ సూచించారు. మంగళవారం ఆమె రెడ్డిచెర్ల, సూరవారిపల్లి గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. ఆహార ధాన్యాలను నిల్వ చేసేటప్పుడు 10 శాతం జాగ్రత్తలు కూడా తీసుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. నిల్వ చేసిన ధాన్యానికి ముక్కుపురుగు, తొట్టుపురుగు, పుచ్చుపురుగు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

తక్కెళ్లపాడులో తాగునీటికి కటకట


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: గ్రామంలో తాగడానికి మంచి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండలంలోని పీ తక్కెళ్లపాడు గ్రామ ఎస్సీ కాలనీవాసులు అన్నారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా మండలంలోని తక్కెళ్లపాడులో మంగళవారం రాత్రి ప్రజా చైతన్య యాత్ర బృందం కాలనీ వాసులను కలిసి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగడానికి మంచి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామంలో అక్కడక్కడా ఉన్న పంచాయతీ నీటి కుళాయిలు కూడా పనిచేయడం లేదని వారు బృందం దృష్టికి తెచ్చారు. తమ కాలనీలో రోడ్లు సైడు కాలువలు లేవని వారు తెలిపారు. మురుగు కాలవల్లేక మురుగు నీరు ఎక్కడి దక్కడే నిలిచిపోయి దోమలు విపరీతంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం తమ సమస్యల గురించి పట్టించుకోవడంలేదని వాపోయారు. ప్రజా చైతన్య యాత్ర బృందంలో సీపీఎం మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, యు సీతారామరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న డీన్ అనీల్‌కుమార్

మార్కాపురం టౌన్: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాంగో డీబీ డేటా బేస్‌పై 10 రోజుల వర్క్ షాపును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్సు డీన్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన సాంకేతిక విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో రియల్‌టైమ్ అప్లికేషన్స్, మాంగో డీబీ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ప్రాక్టికల్స్ పరిజ్ఞానం పొందేందుకు వర్క్‌షాపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 18 వరకు వర్క్ షాప్ కొనసాగుతుందని తెలిపారు.

మా తూకం ఇంతే..!

- కార్డుదారులకు తూకంలో మోసం


కేజీ రాయి పెట్టి బియ్యం తూకం

బేస్తవారిపేట: స్థానిక ప్రభుత్వ చౌకధరల దుకాణం –3 డీలర్ రేషన్ బియ్యం తూకంలో మోసం చేస్తున్నాడు. కేజీ రాయి పెట్టి లబ్ధిదారులకు తక్కువ బియ్యం ఇస్తున్నాడు. ఈ విషయాన్ని గమనించిన కార్డుదారులు ప్రశ్నిస్తే మాకు తక్కువ వస్తున్నాయని, మేము కూడా తక్కువ వేస్తున్నామని సమాధానం చెబుతున్నాడు. కొందరితో దురుసుగా ప్రవర్తిస్తూ నాకు నాయకుల అండ ఉంది.. వారికి చెబుతా.. వీరికి చెబుతానంటూ బెదిరిస్తున్నాడని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డీలర్‌పై చర్యలు తీసుకుని కార్డుదారులకు న్యాయం చేయాలని రేషన్‌కార్డుదారులు కోరుతున్నారు.


తూకంలో మోసం చేస్తున్న రేషన్ షాపు

మురుగు తాండవం!

పొదిలి: పట్టణ పరిధిలోని విశ్వనాథపురం కాలేజీ రోడ్డు, సబ్‌స్టేషన్ రోడ్డు, నేతపాలెంలో పారిశుధ్య సమస్య తాండవిస్తోంది. డ్రెయినేజీలు పొంగి పొర్లి మురుగు మొత్తం రోడ్లపైకి చేరుతోంది. విశ్వనాథపురం మొదటి లైనులో రోడ్లపైకి చేరిన మురుగు పాఠశాల విద్యార్థులు, స్థానికులకు నిత్య సంకటంగా మారింది. దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి. కాలువలపై పలుచోట్ల గృహాల వారు నిర్మించిన మెట్ల వల్ల పూడిక తీసేందుకు అవకాశం లేకపోవటంతో మురుగు రోడ్లపైకి చేరుతోంది. మరో వైపు డ్రెయినేజీని శుభ్రం చేసే క్రమంలో కాలువలపై వేసిన రాళ్లను తొలగించి అలాగే వదిలేశారు. యథాస్థానంలో తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని, రోడ్డుపై రాకపోకలకు అవరోధంగా మారిన సిమెంట్ దిమ్మెలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా.. 'ఒక వైపు నుంచి కాలువలు శుభ్రం చేయిస్తున్నాం. సిమెంటు దిమ్మెలను సరిచేయిస్తాం. సైడు కాలువలపై మెట్లు నిర్మించిన వారికి నోటీసులిచ్చి వాటిని తొలగించేలా చేస్తాం' అన్నారు.


కాలేజీ రోడ్డు మొదటి లైనులో పరిస్థితి ఇదీ..


పొదిలి పట్టణంలోని నేతపాలెంలో రోడ్డుపైకి చేరిన మురుగు




విద్యుత్ సబ్ స్టేషన్ రోడ్డులో ప్రమాదకరంగా డ్రెయినేజీ మూతలు